ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 326 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 4 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## తెలంగాణ నికర జలాలకు
# తీరని అన్యాయం

కృష్ణాజలాల్లో తెలంగాణకు తీరని అన్యాయం
కేటాయింపులకు మించి వాడుకుంటున్న ఏపి
కృష్ణ బేసిన్ నుంచి నీటి తరలింపు అడ్డుకోవాలి
బనకచర్లకు గోదావరి తరలింపుపై కేంద్రానికి ఫిర్యాదు
గోదావరి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలి
కేంద్రమంత్రి సిఆర్ పాటిల్తో సిఎం రేవంత్ భేటీ
పలు అంశాలపై వినతిపత్రం సమర్పణ



**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక నీటిని తీసుకుంటోందని ఆయన విమర్శించారు. నీటి తరలింపును అడ్డుకోవాలని తాము కేంద్రాన్ని కోరామని స్పష్టం చేశారు. నికర జలాలలను సైతం వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. గోదావరి వరద జలాలను బనకచర్లకు తరలిస్తామని అంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన సీఎం.. పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మంత్రి ఉత్తమ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలతోపాటు నీటిపారుదల శాఖ ..మిగతా 2లో




## గిర్ వణ్యప్రాణి సంరక్షణలో
# లయన్ సఫారీ
### గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన

**గాంధీనగర్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులోభాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ ఆదివారం రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహమైన సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వణ్యప్రాణి ..మిగతా 2లో

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల
# ఫలితాలు విడుదల
### ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీలుగా పింగళి శ్రీపాల్ రెడ్డి, మల్క కొమురయ్య విజయం



**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ పోరు ఫలితాలు వెలువడ్డాయి. నల్గొండ-ఖమ్మం-వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీగా శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా మల్లా కొమురయ్య గెలుపొందారు. నల్గొండలోని వేర్‌హౌసింగ్ గోదాములో జరిగిన కౌంటింగ్‌లో శ్రీపాల్ రెడ్డి తన ప్రత్యర్థులైన అలుగుబెల్లి నర్సిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాలేదు. దీంతో అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై శ్రీపాల్ రెడ్డి గెలుపొందారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజక వర్గంలో 24,139 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఇవాళ ..మిగతా 2లో



## అయోధ్య రామాలయంపై
# దాడికి ఉగ్రవాదుల కుట్ర
### భగ్నం చేసిన పోలీసులు..!

**న్యూఢిల్లీ, మార్చి 3 (ప్రభాత ఉదయం):** అయోధ్యలోని రామాలయంతోపాటు పలు మతపరమైన సంస్థలపై దాడికి ఉగ్రవాదులు కుట్ర పన్నారు. ఈ కుట్రను గుజరాత్ పోలీసులు భగ్నం చేశారు. గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు హర్యానాలోని ఫరీదాబాద్‌లోగల పాలి ఏరియాలో ఒక టెర్రరిస్టును అరెస్టు చేశారు. అతని నుంచి రెండు గ్రెనేడ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీలు, ఫరీదాబాద్ ఎస్‌టీఎఫ్‌తో కలిసి సంయుక్తంగా గుజరాత్ ఏటీఎస్ ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. టెర్రరిస్టుల టార్గెట్‌లలో ..మిగతా 2లో

## 100 శాతం సీట్లు
# తెలంగాణ విద్యార్థులకే
### తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం



**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఈఏపీసెట్‌కు సంబంధించి కన్వీనర్ కోటా సీట్లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో 100 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వుచేస్తూ జీవో జారీ చేశారు. అయితే తాజాగా ఏపీలో ఈ పరీక్ష సెంటర్లను కూడా రద్దు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్న హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలను తొలగిస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. తొలుత ఏపీలోని విజయవాడ, కర్నూలు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. అయితే ఏపీ విద్యార్థులు పోటీపడేందుకున్న 15 శాతం స్థానికేతర సీట్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన తర్వాత.. పరీక్ష కేంద్రాల రద్దు నిర్ణయం తీసుకుంది. ప్రతీయేట తెలంగాణ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇంజనీరింగ్, వ్యవసాయం, ..మిగతా 2లో

# సెంటీమీటర్ తవ్వడం చేతకాని రేవంత్
### బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు
### తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు
### ఏ ప్రమాదం జరగకుండా 12 కి.మీ తవ్విన చరిత్ర బీఆర్ఎస్‌ది: కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం, 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పండబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల నిండు ప్రాణాలను ఫణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రిదేనని చెప్పారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005-2014 వరకున్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే అన్నారు. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా, ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ ..మిగతా 2లో

## కొత్త దంపతులు
# త్వరగా పిల్లలను కనాలి
### జనాభా పెంచడానికి ఇదొక్కటే మార్గం
### తమిళనాడు సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



**చెన్నై, మార్చి 3 (ప్రభాత ఉదయం):** లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో జనాభా ప్రాతిపదికన చేపడితే నష్టపోతామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని ..మిగతా 2లో



# అయోధ్య రామాలయంపై దాడికి ఉగ్రవాదుల కుట్ర

మొదటి పేజీ తరువాయి...

అయోధ్య రామమందిరంపై దాడి చేయడం కూడా ఒకటిగా ఉన్నట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. కాగా ఫరిదాబాద్‌లో అరెస్టయిన టెర్రరిస్టు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అబ్దుల్ రెహ్మాన్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గ్రెనేడ్‌లను నిర్వీర్యం చేశారు. రెహ్మాకు టెర్రరిస్టు సంస్థలతో ఉన్న సంబంధం, అతని టార్గెట్‌కు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు అతడిని గుజరాత్‌కు తరలిస్తున్నారు. రెహ్మాన్ అరెస్టుతో భారీ ఉగ్రదాడి కుట్ర భగ్నమైనట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా ఉగ్రవాదుల జాడ కోసం గుజరాత్ ఏటీఎస్ చేపట్టిన సెర్చింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.అబ్దుల్ రెహ్మాన్ అరెస్ట్ ద్వారా అయోధ్య రామాలయంపై దాడికి కుట్ర పన్నినట్లు బయటపడటంతో అయోధ్యలో హై అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా రామాలయం దగ్గర భద్రతను పటిష్టం చేశారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి...

ఉదయం ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 9 గంటలకు ముగిసింది. మొత్తం 25 టేబుళ్లలో కౌంటింగ్ నిర్వహించారు. మల్లా కొమురయ్య విజయం : మరోవైపు కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా మల్లా కొమురయ్య విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2,50,106 మంది ఓటు వేయగా బీజేపీ మద్దతున్న కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ జరిగింది.

ఈ విజయం వారిదే : ఈ విజయం ఉపాధ్యాయుల ఆత్మగౌరవమని శ్రీపాల్ రెడ్డి చెప్పారు. ఇది ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇచ్చిన తీర్పు అని తెలిపారు. రాష్ట్రంలో పాఠశాల, ఉన్నతవిద్య కోసం కృషి చేస్తానని, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై పోరాడతానని ఆయన ప్రకటించారు. విద్యారంగంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలుపేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.మరోవైపు కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం కౌంటింగ్ కొనసాగుతోంది. రేపటి వరకు ఫలితం రావొచ్చని అధికారులు అంచనావేశారు.

# సెంటీమీటర్ తవ్వడం చేతకాని రేవంత్

మొదటి పేజీ తరువాయి...

పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులకు రూ.3300 కోట్ల ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ పాలనలో రూ.3900 కోట్ల పనులు పూర్తిచేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవాచేశారు. గత కాంగ్రెస్ సర్కారుకన్నా రూ.600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేండ్లలోనే 203 కిలోమీటర్ల టన్నెళ్లు తవ్వినా, ఎస్ఎల్‌బీసీ వంటి దారుణ సంఘటన జరిగిన దాఖలా లేవని వెల్లడించారు. రైతులకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు కాకుండా.. గల్లీ నుంచి ఢిల్లీదాకా కమీషన్లిచ్చే ప్రాజెక్టులు చేపట్టి వాటిని అర్థాంతరంగా గాలికి వదిలేసే నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప ముఖ్యమంత్రి ముందు మరో మార్గం లేదని చెప్పారు. ఈ డ్యామేజ్ డైవర్షన్ కుట్రలు చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

# కొత్త దంపతులు త్వరగా పిల్లలను కనాలి

మొదటి పేజీ తరువాయి...

గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. అందుకే నేను కోరుకునేది ఒక్కటే. కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి‘ అని సీఎం రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొళత్తూర్‌లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. ‘పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది‘ అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే

మొదటి పేజీ తరువాయి...

ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు దాదాపు 55 వేలకుపైగా అప్లికేషన్లు వచ్చేవి. ఏపీ నుంచి 3 వేలకు పైగా దరఖాస్తులు వచ్చేవి. అధిక మొత్తంలో ఏపీ విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్లు వస్తున్నందున కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరులలో కేంద్రాలతో పరీక్షను నిర్వహిస్తూ వచ్చింది. ఈఏపీసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొత్తం 5,010 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 3,116 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 1891 మంది, రెండు పరీక్షలకు హాజరయ్యేందుకు ముగ్గురు చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఇస్తారు. అభ్యర్థులు రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు. రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక వ్యవసాయ, ఫార్మసీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29, 30 తేదీలలో జరుగుతుంది, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష మే 2 నుంచి 5 వరకు ఉంటుంది. హాల్ టిక్కెట్లను ఏప్రిల్ 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# తెలంగాణ నికర జలాలకు తీరని అన్యాయం

మొదటి పేజీ తరువాయి...



ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల కేటాయింపు, వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సంఘటనను సైతం మంత్రికి వీరు సోదాహరణగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతోన్న బనకచర్లపై తమ అభ్యంతరాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజేశామన్నారు. అయితే ఏపీ నుంచి ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమకు ఎలాంటి డీపీఆర్ రాలేదని మంత్రి వివరించారని చెప్పారని తెలిపారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క - సారక్క ప్రాజెక్టులకు.. త్వరగా నీటి కేటాయింపులు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరించారు. ఇక తమ ప్రాజెక్టులకు సెంట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్స్ ఇంకా రాలేదని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరామని చెప్పారు. గోదావరి జలాలను అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు ఇంత వరకు జరగలేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తమ ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం చెబుతోందంటూ ఏపీపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ ప్రాజెక్టులకు, శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే నికర జలాలు ఉన్నాయనేది లెక్క తేలుతుందని ఆయన వివరించారు. తెలంగాణలో గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత ఇతర ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. కృష్ణా బేసిన్‌లో ఏపీ సర్కార్ ఎక్కువ నీటిని తీసుకుంటోందని, అలా తీసుకోకుండా అడ్డుకోవాలని కేంద్రానికి చెప్పామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్లపై తమ అభ్యంతరం తెలపగా.. తప్పకుండా జోక్యం చేసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. ‘తెలంగాణలో గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదు. మాకు కేటాయింపులు జరిగిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. కృష్ణా జలాల విషయంలో వచ్చిన సమస్యలే భవిష్యత్‌లో గోదావరి విషయంలో వస్తాయి. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం తెలిపారు. ‘బనకచర్లపై ఏపీ సర్కార్ ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని కేంద్రమంత్రి చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయింపుల పెంపుపైనా చర్చించాం. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు కేంద్రాన్ని నిధులు అడిగాం. మొత్తం ఐదు ప్రాజెక్టులకు నిధులు కోరాం. ఉమ్మడి ప్రాజెక్టులపై టెలిమెట్రీలను త్వరగా ఏర్పాటు చేయాలని అడిగాం. టెలిమెట్రీల ఏర్పాటుకు అవసరమైతే ఏపీ వాటా భరిస్తామని చెప్పాం. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ రిపోర్టు త్వరగా ఇవ్వాలని కోరాం. అలాగైతే మేం చర్యలు చేపడతామని చెప్పాం‘ అని ఉత్తమ్ మీడియాకు వివరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ తీసుకు వెళ్తున్న అధిక జలాలను ఆపాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను తాము కోరామన్నారు. కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకొని ఈ అన్యాయాన్ని ఆపాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తాము అభ్యంతరం చెప్పామని ఆయన స్పష్టం చేశారు. అయితే దీనిపై ఏపీ నుంచి ఎటువంటి నివేదిక రాలేదని.. ఈ అంశంలో తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణకు అధిక నీరు ఇచ్చేలా సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. పాలమూరు రంగారెడ్డి, సమ్మక్క సారక్క, సీతారామ సాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు నిధులు సైతం ఇవ్వాలని తాము అడిగాని వివరించారు. అలాగే కృష్ణా నదిలో శ్రీశైలం, నాగార్జున సాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో టెలీ మెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అవసరమైతే.. టెలీమెట్రీల కోసం తెలంగాణ, ఆంధ్రా వాటా ఖర్చు సైతం తామే భరిస్తామని కేంద్రానికి స్పష్టం చేశామని వివరించారు. తమ ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారన్నారు. మరోవైపు ఇండియా ఇన్‌ఫ్రాస్టక్చ్రర్ ఫండ్ నుంచి తెలంగాణకు 50 ఏళ్ల పాటు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరామన్నారు. అలాగే మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నుంచి త్వరగా నివేదిక అందేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణ జల వనరుల విషయంలో కేంద్రం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, తాను.. బలమైన వాదనలు వినిపించామని తెలిపారు. కృష్ణా జలాల వివాదంలో రోజు వారీగా కేంద్రం జోక్యం చేసుకుంటుందని హామీ ఇచ్చిందని చెప్పారు. అదే విధంగా దీర్ఘకాలికంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరాన్నారు. తుమ్మడిహట్టి సమీపంలో గతంలో కాంగ్రెస్ ప్రతిపాదించి పనులు మొదలు పెట్టనున్నామ న్నారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో కూడా కేంద్రంతో చర్చించామన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ విషయంలో సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు.

### 8న హామీలు అమలు చేయకపోతే 10వేల మహిళలు

# 10వేల గ్రామాల్లోకి వెళ్తారు

**కోటీమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మాటెటుపోయింది..?**

**మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పాత్ర శూన్యం**

**బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత**



**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** మహిళలకు ఇచ్చిన హామీల సాధనకై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్ మాటలు ఉత్తవేనని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2500 వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లలో లక్ష కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ వట్టిదేనని చెప్పారు.జాగృతి మహిళా కార్యకర్తల నుంచి సేకరించిన 10 వేల పోస్టుల కార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హామీల అమలుపై మార్చి 8న ప్రకటన చేయకపోతే 10 వేల మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామన్నారు. లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని చెప్పారు. మహిళల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని విమర్శించారు. ఆడబిడ్డల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తుచేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీలేదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవి పేరు పెట్టాలడి డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము కూడా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం ప్రకటనకు, ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్పా పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశంలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెడితే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. మార్చి 8న ఈ పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని విమర్శించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వడ్డీ రాయితీ బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలన్నారు. భర్త చనిపోయిన మహిళలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు వస్తున్న పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కొత్తగా పెన్షన్‌దారులను నమోదుచేయడం లేదన్నారు. తక్షణమే పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచడంతోపాటు, అభయ హస్తం నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. నేరాల శాతం 20 శాతం పెరిగాయని డీజీపీ వెల్లడించారు. ఆడబిడ్డలకు రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలన్నారు. కేసీఆర్ కిట్ పంపిణీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీ మానవత్వాన్ని మంటకలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసీఆర్ కిట్‌ను కొనసాగించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. మహిళా కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మహిళా కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం ధాంబికాలు పలుకుతున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఆ పోస్టులను సృష్టించారని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఆడపిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చేయడం లేదని, దీంతో తల్లిదండ్రులు వారిని చదువు మానిపిస్తున్నారని తెలిపారు.

# గిర్ వణ్యప్రాణి సంరక్షణలో లయన్ సఫారీ

మొదటి పేజీ తరువాయి...

సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఔఃచిబ) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించ నున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం. ఆసియాటిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం.. ఆసియాటిక్ సింహాలు గుజరాత్‌లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

# అంగరంగ వైభవంగా ఆస్కార్ పండగ

**ఆనోరా మూవీకి అవార్డులు పంట**

**అన్ని విభాగాల్లోనూ ఉత్తమ చిత్రంగా ఎంపిక**

**లాస్‌ఎంజిల్స్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూసిన ఆస్కార్ అవార్డుల సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన 'అనోరా'కు అవార్డుల పంట పండింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్ విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. 'ది బ్రూటలిస్ట్'లో నటనకు గానూ ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ.. 'అనోరా'లో నటనకు మైకీ మ్యాడిసన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. సీన్ బేకర్ (అనోరా) ఉత్తమ దర్శకుడిగా అవార్డు సొంతం చేసుకున్నారు. ఇక 'ఎ రియల్ పెయిన్' చిత్రానికి కీరన్ కైల్ కల్కిన్ ఉత్తమ సహాయ నటుడిగా.. 'ఎమిలియా పెరెజ్'లో నటనకు జోయా సాల్దానా ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ అందుకున్నారు. గతేడాది బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన 'డ్యూన్: పార్ట్2' ఉత్తమ సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. ఇక లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశం నుంచి నామినేషన్‌లో నిలిచిన 'అనూజ' చిత్రానికి మాత్రం నిరాశ ఎదురైంది. ఆ కేటగిరిలో 'ఐయామ్ నాట్ ఏ రోబో' ఉత్తమ లఘు చిత్రంగా అవార్డును గెలుచుకుంది. లాస్ ఏంజెలెస్ డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరిగిన 97వ అకాడెమీ అవార్డుల వేడుకకు హాలీవుడ్ ముఖ్య తారాగణంతో పాటు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. నటీమణులు ఫ్యాషన్ ప్రపంచానికి సరికొత్త భాష్యం చెబుతూ ట్రెండీ దుస్తుల్లో మెరిశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆస్కార్ అవార్డుల వేడుకకు వచ్చిన అతిథులతో నటి, వ్యాఖ్యాత అమేలియా డిమోడలెన్‌బర్గ్ చిట్‌చాట్ చేశారు. అరియానా గ్రాండే, సింథియా ఎరివో, డోజా క్యాట్, లిసా, క్వీన్ లతీఫా, రేయ్‌లు తమ ప్రదర్శనతో ఆహూతులను అలరించారు.

# రైతులకు సాధికారత లభించినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు
## కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి



జాతీయ మిల్లెట్ కిసాన్ మేళా - ఇండస్ట్రీ మీట్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర వ్యసాయ, రైతు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఐఐఎం ఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి

బుద్వేల్, మార్చి3 (ప్రభాత ఉదయం): రైతులకు సాధికారత లభించనంత కాలం దేశం అభివృ ద్ధి చెందిన దేశం కాదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి అన్నారు. రాజేంద్రనగర్ లోగల జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎం ఆర్) ఆధ్వర్యంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ ( శ్రీ అన్న) సహకారంతో జాతీయ చిరుదాన్యాల కిసాన్ మేళ, ఇండస్ట్రీ మీట్ కార్యక్రమాన్ని సోమవారం రాజేంద్రనగర్ లో నిర్వహిం చారు. ఈ మిల్లెట్ కిసాన్ మేళ ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో రైతులు, పరిశోధనల ప్రాముఖ్యతను ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిరుధాన్యాలను శ్రీ అన్నంగా ప్రకటించారని గుర్తు చేశారు. దీంతో చిరుధాన్యాల పంటలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందడానికి దోహదపడిందన్నారు. చిరుధాన్యాలలో పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. చిరుధాన్యాలు మానవులకే కాకుండ పశువులకు, పక్షులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందజేస్తాయన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మట్టి పరీక్షలు చేసిన అనంతరమే ఎరువుల ను వాడాలన్నారు. దాని ద్వారా పంట ఖర్చులు తగ్గడం, దిగుబడి ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. గత 10 సంవత్సరాలలో రైతుల ప్రయోజనం కోసం ఇతర పంటలతో పాటు చిరుధాన్యాల పంటలకు మద్దతు ధర ను రెండు మూడు రేట్లను పెంచడం జరిగిందన్నారు. చిరుదాన్యాలను ప్రోత్సహించడంలో, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడానికి తాజా మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాలలో కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) ఫార్మర్స్ పొడ్యుసర్స్ ఆర్గనైజేషన్స్ ల పాత్ర చాలా ఉంటుందన్నారు. చిరుధాన్యాల పం టలలో ప్రాసెసింగ్ విధానాలు, విలువ జోడింపు కార్యక్రమాలు జోడిస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. చిరుధాన్యాలు పండించే రైతులకు 50శాతం రవాణ ఖర్చులు కేంద్ర ప్రభుత్వం భరిం చడానికి ఆలోచన చేస్తుందన్నారు. ఇలా చేస్తే వ్యవసాయదారులు, వినియోగదారుల మద్య ఉన్నటువంటి అంతరాయాన్ని తగ్గించవచ్చన్నారు. భవిష్యత్తులో ఎరువుల సబ్సిడీలను నేరుగా రైతుల ఖాతాలలోకి బదిలీ చేయనున్నట్లు భగీరథ్ చౌదరి తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ. 3లక్షల నుంచి రూ. 5లక్షలకు పెండచడం జరిగిందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వస్తున్న సవాళ్లను శాస్త్రవేత్తతతలు ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సరల్ డాక్టర్ అల్దాస్ జానయ్య, శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎం టర్ప్రైజస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నుంచు గ్లోరి స్వరూప, అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ (ఐఐఓఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్. కే మాదూర్. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మీట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.బి బార్బుడ్డే , అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్పోర్ట్ డెవలప్మెంట్ అథారిటీ (అపెడా) రీజినల్ హెడ్ డాక్టర్ కె.పి నాయుడు, ఐఐఎంఆర్ కు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ ఎగ్జిబిషన్ కు వందలాది మంది రైతులు హాజరైనారు. వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. అందకు ముందు కేంద్ర మంత్రి భగీరద్ చౌదరి ఐఐఎంఆర్ లో చేపడుతున్న పరిశోధనలను స్వయంగా తిలకించారు.



రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఉపవాస దీక్షలను వదులుతున్న ఘడా బేగ్ మసీదు కమిటీ చైర్మన్ సయ్యద్ హిదాయతుల్లా షఫీ, కుటుంబ సభ్యులు



## రాజేంద్రనగర్ సర్కిల్‌లో వెలగని వీధి దీపాలు

బుద్వేల్, మార్చి3(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో చాలా బస్తీలలో వీధి దీపాలు వెలుగడం లేదు. ప్రధాన రహదారులలో కూడా అంధకారం నెలకొంది. నెలల తరబడి వీధి దీపాలు వెలుగకపోయినా ఎవరు పట్టించుకోవడం లేదు. రాజేంద్రనగర్ సర్కిల్ లో వీధి దీపాల పర్యవేక్షణ చూసే అధికారుల కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుంది. వీధి దీపాల కోసం డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ ను కలసి విన్నవించుకున్న ఎలాంటి పనులు జరుగడం లేదు. జోనల్ కమిషనర్ స్పందించి సాయంత్రం వేళలలో రాజేంద్రనగర్ సర్కిల్ లోని బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులలో పర్యటించి ఎక్కడైతే వీధి దీపాలు వెలుగడం లేదో అక్కడ వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలని ఆయా కాలనీల అధ్యక్షులు కోరుతున్నారు.

### బుద్వేల్ శ్రీ శివసాయి కాలనీలో......

బుద్వేల్ శ్రీ శివసాయి కాలనీలో పలు వీధులలో వీధి దీపాలు వెలుగడం లేదని ఆ కాలనీ సం క్షేమ సంఘం అధ్యక్షుడు ఎం. గోపాల్ రెడ్డి వాపోయారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ కు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ఎలక్ట్రికల్ పనులు చూసే అధికారులకు విన్నవించుకున్నా మా చేతుల్లో ఏమి లేదు అని సమాదానం ఇస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో వీధి దీపాలు పాడైతే కొత్తవి వేయడానికి ఉండటం లేదని వారు సమాదానం ఇస్తున్నారన్నారు. వీధి దీపాలు వెలుగకపోవడంతో కాలనీలలో పాములు తిరుగుతున్నాయని గుర్తు చేశారు. అధికారులు స్పందించి శ్రీ శివసాయి కాలనీలో వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలని కోరుతున్నారు.

### పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్సాగర్ వరకు

పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డును కలిపే రేడియల్ రోడ్డు 2 లో రోడ్డు మధ్య డివైడర్ వాల్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డులో లైట్లు వెలుగడం లేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి గా ఉండటం వల్ల ఈ రహదారిలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును పట్టించుకునే వారే లేకుండ పోయారు.

### పాత కర్నూల్ రోడ్డులో లైట్లు వెలిగేటట్లు చూడాలి

కాటేదాన్ నుంచి గగన్ పహడ్ వెళ్లే మార్గంలో పాత కర్నూల్ రోడ్డులో లైట్లు వెలిగేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ఇక్కడ లైట్లు వెలుగకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

### రాజేంద్రనగర్ లోను వెలగని వీధి దీపాలు :

రాజేంద్రనగర్ బస్తీలో, నవజ్యోతి యూత్ క్లబ్ అవరణలో వీధి దీపాలు వెలుగడం లేదని నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల వెంకటేశం, ఎస్.వెంకటేష్ లు వాపోయారు. బస్తీలలో వెలుగని వీధి దీపాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.




ఏటీఎంకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

## డబ్బు రావడం లేదని ఏటీఎంకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

బుద్వేల్, మార్చి 3(ప్రభాత ఉదయం): మధుబన్ కాలనీలోని ఏటీఎంకు గుర్తు తెలియని వ్యక్తులు నొప్పి పెట్టారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.... ఆదివారం తెల్లవారుజామున మైలార్ దేవుపల్లి డివిజన్ మధుబన్ కాలనీలో ఉన్న ఎస్ బీ ఐ ఎటిఎం లో చోరీకి గుర్తూ తెలియని వ్యక్తులు విపల యత్నం చేశారు. ఎంతకు డబ్బులు రాకపోవడంతో దొంగలు ఏటీఎం కు నిప్పు పెట్టారు. దీంతో ఏటీఎం పూర్తిగా కాలిపోయింది.

# పాఠశాల భవనంపై నుంచి దూకి క్రింద పడి మంచానికే పరిమితమైన లావణ్యను పరామర్శించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

### బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల తరపున లక్ష రూపాయల చెక్కు అందజేత





లావణ్య ను కలసి లక్ష రూపాయల చెక్కును అందచేస్తున్న బీసీ కమీషన్ ఛైర్మన్ జి నిరంజన్

బుద్వేల్, మార్చి3(ప్రభాత ఉదయం): ఇబ్రహీంపట్నం రాజమహేంద్ర క్యాంపస్ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ లో చదువుతు మనస్థాపానికి గురై భవనం పై నుంచి దూకి క్రింద పడి నడవలేని స్థితిలో ఉన్న గడ్డ లావణ్యను సోమవారం బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ పరమార్శించారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి డివిజన్ లక్ష్మీగూడ వాంబే కాలనీ లో నివాసం ఉంటున్న గడ్డ లావణ్య కుటుంబ సభ్యులను కలసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడి మంచానికే పరిమితమైన లావణ్యకు గురుకుల రెసిడెన్షియల్ స్కూల్ తరపున లక్ష రూపాయల చెక్కును అందజేశారు. 10వ తరగతి చదువుతున్న గడ్డ లావణ్య తన పట్ల మహిళా ఉపాధ్యాయురాలు చులకనగా మాట్లాడటంతో తల్లిదండ్రులకు చెప్పలేక పాఠశాల పై అంతస్తు నుంచి 2024 నవంబరు 9వ తేదీన క్రిందకు దూకానన్నారు. అప్పటి నుంచి చికిత్స చేయించుకుంటున్న తన పరిస్థితి మంచానికే పరిమితం అయ్యిందని, ప్రస్తుతం ఫిజియోథెరఫీ జరుగుతుందన్నారు. కోలుకోవడానికి మరో ఆరు నెలలు పట్టే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సి పాల్ కె.శ్రీలత పాఠశాల తరపున లావణ్యకు లక్ష రూపాయల చెక్కును ఆర్థిక సహాయంగా ఆదించారు. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్. సభ్యురాలు రంగు బాలలక్ష్మీ లు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ విజయలక్ష్మీ, లతో మాట్లాడుతూ, లావణ్య ఆరోగ్యం పూర్తిగా మెరుగు పడే వరకు ఒక పిజియోథెరపీ డాక్టర్ ను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలకు వెళ్లడానికి అంబులెన్స్ ను ఏర్పాటు చేయాలని, కావాల్సిన మందులను సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, మార్చి3(ప్రభాత ఉదయం) కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల రాక్షర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి 4:30 వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



శ్రీరాంనగర్ రోడ్డు మధ్యలో మురుగు

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

బుద్వేల్, మార్చి3(ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపం లోని శ్రీరాంనగర్ రోడ్లు గుంతలమయ్యాయి. ఆ గుంతలలో మురుగునీరు నిల్వడంతో దుర్వాసన తో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోడ్లపైన గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. శ్రీరాంకాలనీ లో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని నవ యువ యువ జన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. కిషోర్ రెడ్డి , సంతోష్, అనిల్, త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో ఛాంపియన్షిప్‌లో విద్యార్థులకు బంగారు పథకాలు




కొత్తకోట, మార్చి 3(ప్రభాత ఉదయం)ఈనెల 1, 2 తేదీలలో హైదరాబాద్ లో జరిగిన 13వ, ఓపెన్ స్టేట్ లెవెల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ టోర్నమెంట్, శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో పోటీలను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో కొత్తకోట, అగ్రహారం, పాలెం , కనిమెట్ట మరియు మోజర్ల గ్రామాలకు చెందిన విద్యార్థులు మొత్తం 40 మంది పాల్గొనడం జరిగిందని ఈ పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచి గెలుపొందారు. విద్యార్థులకు 5 గోల్డ్ మెడల్ ,15 సిల్వర్ మెడల్, 10 బ్రోంజ్ మెడల్ సాధించడం జరిగిందని, వీరికి తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ మాస్టర్ చేతులమీదుగా మెడల్స్ ను అందించడం జరిగిందని కోచులు శివశంకర్, రవి, పరుశరాములు తెలిపారు. టోర్నమెంట్లో విజయం సాధించిన విద్యార్థులను సీనియర్ మాస్టర్స్ పెంటన్న ,నరేందర్ సాగర్ ,శీను, సంతోష్ ,నరేష్ నాయుడు ,రమేష్ రెడ్డి, మాధవ్ ,శివయ్య ,యాదగిరి అభినందనలు తెలిపారు.





శ్రేష్ఠ మేరీ జన్మదిన వేడుకలలో పాల్గొన్న కుటుంబ సభ్యులు



## ఘనంగా శ్రేష్ఠ మేరీ జన్మదిన వేడుకలు

బుద్వేల్, మార్చి 3(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వాస్తవ్యులు, అప్పారెడ్డిగూడెం మహేందర్ - కళాశ్రీ ల కుమార్తె శ్రేష్ఠ మేరీ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పారెడ్డిగూడెం భీమయ్య - మాధవి, అప్పారెడ్డిగూడెం రవి - ఝాన్సీ ల కుటుంబ సభ్యులు శశాంక్, మనస్విన్, మాళవిక, మనుదీప్ లు పాల్గొన్నారు.




# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**పరీక్షలు రాయనున్న 8,341 మంది విద్యార్థులు**

**జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలు**

**ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ**

**గద్వాల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజ్**

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి3(ప్రభాత ఉదయం)ఇంటర్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్‌ల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్స్‌ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 14పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 8,341 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజ్ తెలిపారు.

### జిల్లాలో 8,341 మంది విద్యార్థులు...

జోగుళాంబ గద్వాల జిల్లాలో 14 కేంద్రాల ద్వారా ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 8.10 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష రాయడం పూర్తి చేసినా పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే బయటకు పంపిస్తారు. ఒక నిముషం ఆలస్యమైనా అనుమతించరు. ఇతర గ్రామాల నుంచి పరీక్షలకు వచ్చే విద్యార్థుల కోసం బస్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 8,341 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,057 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 4,284 మంది ఉన్నారు.

### ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఒక నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9160125322 నంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు .



# 104 ప్యాకేజీ కాలువకు సాగునీరు విడుదల చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి3(ప్రభాత ఉదయం)ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 104 ప్యాకేజి కాలువకు సాగునీటిని విడుదల చేయాలని కొండాపురం రైతులు డిమాండ్ చేశారు. 104 ప్యాకేజి కాలువకు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 104 ప్యాకేజి కాలువ ద్వారా కేటిదొడ్డి మండలంలో మైలగడ్డ, కొండాపురం, వెంకటాపురం తదితర గ్రామాలకు సాగునీరందుతుందన్నారు. గత కొంతకాలంగా యాసంగీ సీజన్ లో 104 ప్యాకేజి కాలువకు అధికారులు వార బంధీ ద్వారా నీటి విడుదల చేయడంతో కొండాపురం గ్రామ శివారులోగల వ్యవసాయ భూములకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. 104ప్యాకేజీ కాలువ ద్వారా సాగు నీరందించాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నక్కరవి, గాజుల క్రిష్ణ, అంజి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు



# ప్రజావాణికి 35 ఫిర్యాదులు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి3(ప్రభాత ఉదయం)ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజల నుండి 35 ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావులతో కలసి కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘము ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన మహిళా దినోత్సవం లో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు



ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

హైదరాబాద్, మార్చి 3( ప్రభాత ఉదయం): ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రవీంద్ర భారతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సంవత్సరం అసోసియేషన్ యొక్క ప్రధాన లక్ష్యం బ్యాంకు కుటుంబ పెన్షనర్ల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఛైర్‌పర్సన్ వై శోభ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్, పీజీ డీన్ డాక్టర్ కేవీఎస్ మీనా కుమారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, ఆస్తి రికవరీ బ్రాంచ్ ఏజీఎం ఎం రేణుక అవర్ అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథులు ఏ ఐ బి ఆర్ ఎఫ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఏ బి ఆర్ ఈ ఏ అధ్యక్షుడు కృష్ణ మూర్తి, వి. వారణాసి, ఏ ఐ బి ఆర్ ఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ABREA ఏ బి ఆర్ ఈ ఏ జనరల్ సెక్రటరీ ఎన్ ఎస్ ఎన్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం మహిళా విభాగం కన్వీనర్ వై ఎల్ ప్రేమ కుమారి, సహ-కన్వీనర్ వై .త్రిపురాంబ లు పాల్గొని అతిథులను సన్మానించారు. బ్యాంక్ వృద్ధిలో ప్రధాన స్తంభాలుగా ఉన్న గ్రూపులోని సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్ల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, వారు సేవలో ఉన్నప్పుడు లక్షలాది మంది కస్టమర్లకు తమ సేవలను విస్తరించారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత వారు పొందుతున్న కొద్దిపాటి పెన్షన్ కారణంగా ఆరోగ్య సంరక్షణ, సంబంధిత ఖర్చులను నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . ముఖ్యంగా కుటుంబ పెన్షనర్లలో ఎక్కువ మంది మహిళలు మరియు ఆర్థిక ఇబ్బందులకు కారణమయ్యే సమస్యలను ఎదుర్కొంటున్నారు. సభ్యత్వ డ్రైవ్ ద్వారా కనెక్టివిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఏ బీ ఆర్ ఈ ఏ కుటుంబ పెన్షనర్లపై దృష్టి సారించిందన్నారు . వారిలో అవగాహన తీసుకురావడానికి స్థానిక భాషలో కమ్యూనికేట్ చేయడం ద్వారా వాట్సాప్ గ్రూపులను సృష్టించింది. పదవీ విరమణ తర్వాత కూడా మహిళా విభాగం తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, సమాజ సంక్షేమం కోసం వివిధ ప్రదేశాలలో వివిధ ధార్మిక కార్యక్రమాలను చేపడుతోంది. వారణాసి వి కృష్ణ మూర్తి , ఎన్ ఎస్ ఎన్ రెడ్డి ఈ సందర్భంగా మహిళా విభాగాన్ని అభినందించారు . కుటుంబ పెన్షనర్లను గ్రూపులోకి తీసుకురావడంలో బృందం చేసిన కృషిని అభినందించారు. "ప్రతి ఒక్కరూ ఒకరిని పట్టుకోండి" అనే వ్యూహాన్ని అవలంబించడం ద్వారా మా మోటో భాగస్వామ్యం, శ్రద్ధ వహించాలని , కుటుంబ పెన్షనర్లందరినీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా కొంతమంది పెన్షనర్లు మరియు కుటుంబ పెన్షనర్లను సన్మానించారు.

# మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి రజని**





కొత్తకోట, మార్చి 3(ప్రభాత ఉదయం)మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ న్యాయమూర్తి వి రజని అన్నారు .సోమవారం కొత్తకోటలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ని ఆదర్శంగా తీసుకొని మహిళలు అత్యున్నతమైన స్థాయికి ఎదగాలి అని సూచించారు సమాజంలో ఎదురయ్యే ఎటువంటి సమస్యలను అయినా ఎదుర్కొని మహిళలు వారి జీవిత ఆశలను నెరవేర్చుకోవాలని కోరారు అన్ని వర్గాల బాలికలకు మహిళలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుంది అని తెలియజేశారు కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమైన చట్టాలను వివరించడంలో భాగంగా బాల్యవివాహాల చట్టం ఫోక్సో యాక్ట్ బాల కార్మికుల చట్టం మోటారు వెహికల్ చట్టం గురించి తెలియజేశారు ఉచిత న్యాయ సలహాలు కొరకు15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య డిప్యూటీ లార్డ్స్ జీ ఉత్తరయ్య ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.




# సంపత్ కుమార్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి3(ప్రభాత ఉదయం)అనేక ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని సేవలు అందిస్తున్న సీనియర్ నాయకులు ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఎన్ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ కోరారు. సోమవారం గద్వాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసిసి కార్యదర్శి సంపత్ అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి సేవ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటు నాయకులను, కార్యకర్తలను అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో అలంపూర్ తో పాటు గద్వాల్ కి కూడా నాయకుడు లేని సమయంలో కార్యకర్తలకు, నాయకులకు భరోసా గా నిలిచాడు అని నిజమైన కాంగ్రెస్ నాయకుడు సంపత్ కుమార్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో సామాజిక న్యాయం ఉంటుంది అని మాదిగ సామాజిక వర్గం నుండి ఏఐసీసీ కార్యదర్శి గా ఉంటున్న సంపత్ కుమార్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించాలి అని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు ప్రకాష్ యోనా, దేవరపోగు నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అసమర్థ కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**పెద్దపల్లి, మార్చి 3 (ప్రభాత ఉదయం):** అసమర్థ కాంగ్రెస్ పాలనతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వార్‌కు అనుబంధంగా నిర్మిస్తున్న లింక్ కాల్వ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో సోమవారం ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాలల్లోని కాల్వ చివరి గ్రామాల రైతులు, పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో మూడు సంవత్సరాల క్రితం మల్లాపూర్ నుంచి వెల్గటూరు మండలంలోని చివరి గ్రామాలకు సాగునీటికి శాశ్వత పరిష్కారం అందించడానికి రూ.13 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు. ఆ నిధులతో నంది రిజర్వాయర్ నుంచి రెండున్నర కిలోమీటర్ల పాటు లింకు కాలువ పనులు ప్రారంభించగా దాదాపు 90 శాతం పూర్తయిందని ఆయన వివరించారు. కానీ మిగతా కేవలం 10 శాతం పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయించడం లేదని విమర్శించారు. ఈ ప్రాంతానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాల్వ పూర్తి చేయిం చడానికి శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. లక్ష్మణ్ కుమార్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా లింక్ కాలువ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన సవాల్ చేశారు. అదేవిధంగా సారంగాపూర్ మండలంలోని రోళ్ల వాగు పనులు పూర్తి చేయాలన్నారు. తనను విమర్శించే నైతికత లక్ష్మణ్ కుమార్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన అన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు.

## ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన తనయుడు

**హైదరాబాద్, మార్చి 3 (ప్రభాత ఉదయం):** నవ మాసాలు మోసి కనిపెంచిన తల్లిని కనికరం ఓ కసాయి హత్య చేశాడు. ఆస్తి కోసం కన్నతల్లినే కర్కశంగా కత్తితో పొడిచి చంపాడు. వివరాల్లోకి వెళ్తే... తెల్లాపూర్ దివినో విల్లాస్‌లో నివాసముం టున్న రాధిక (52) ను ఆమె కొడుకు కార్తీక్ రెడ్డి సోమవారం ఉదయం ఆస్తి కోసం తల్లితో గొడవ పడ్డాడు. ఈక్రమంలో తల్లిపై కత్తితో దాడి చేసి ఎనిమిదిసార్లు పొడిచాడు. గమనించిన స్థానికులు రాధికను హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాధిక మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తీక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుడు మత్తు పదార్థాలు సేవిస్తూ, మద్యానికి బానిసైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608